

డీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 02 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ నూతన డీఎంహెచ్ఓగా డాక్టర్ నరేందర్ రాథోడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కుష్టు నివారణాధికారి గజానన్, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్‌రావ్, రమేష్, సూపరిండెంట్ గోపి, సీసీ కిరణ్‌తోపాటు పలువురు ఉద్యోగులు కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు ఉద్యోగులు సహకారం అందించాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.



పదవుల కోసం.. పోటాపోటీ





- కాంగ్రెస్‌లో సీనియర్, జూనియర్ నేతల మధ్య పదవుల లొల్లి
- ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికపై ఫిర్యాదులు
- కొత్తగా తెరపైకి వస్తున్న మునిగెల విఠల్ పేరు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకంలోనూ సీనియర్లకే అవకాశం
- నామినేట్, పార్టీ పదవులపై ఆచితూచి అడుగులు వేస్తున్న అధిష్ఠానం

ఆదిలాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌లో సీనియర్, జూనియర్ నేతల మధ్య 'పదవుల' లొల్లి మొదలైంది. దశాబ్ద కాలం తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో నామినేట్ పదవులకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది. ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని పని చేసిన నేతలంతా నామినేట్ పదవులపై నజర్ పెడుతున్నారు. దీంతో పార్టీ పదవులతో పాటు నామినే ట్ పదవుల కోసం పోటాపో టీ కనిపిస్తోంది. ఇన్నాళ్లు పార్టీనే నమ్ముకుని పని చేసిన వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. కొత్తగా టీపీసీసీ అధ్యక్షునిగా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం తర్వాత నిర్ణయాల్లో మార్పులు చేర్పులు కనిపిస్తున్నాయి. దీంతో ఇంత కాలం నామినేట్ పదవులపై భారీ ఆశలు పెట్టుకున్న జూనియర్ నేతలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నామినేట్ పదవులను ఆశించి పార్టీలో చేరిన పదవి దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీలో చేరితే నామినేట్ పదవులు ఇప్పిస్తామంటూ ఇప్పటికే హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు ఇదో కొత్త తల నొప్పిగా మారింది. అధిష్ఠానం ఆదేశాలు పార్టీ క్యాడర్ నుంచి ఒత్తిళ్లు రావడంతో.. పార్టీ ఇన్‌చార్జీలు సతమత మవుతున్నారు. అధిష్ఠానం ఆదేశాలను కాదనలేక నమ్ముకున్న క్యాడర్‌ను దూరం చేసుకోలేక లోలోన తర్జన భర్జన పడుతున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయంతో సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నా.. ఎన్నికలకు ముందు కొత్తగా పార్టీలో చేరిన వారంతా కొంత నిరాశతో కనిపిస్తున్నారు. అయితే త్వరలోనే జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై ప్రభావం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కనీసం 5ఏళ్లు..

పార్టీ పదవులతో పాటు నామినేట్ పదవులు దక్కాలంటే పార్టీలో కనీసం ఐదేళ్ల పాటు పని చేసి ఉండాలన్న నిబంధన కొంత ఇబ్బందికరంగా మారిందంటున్నారు. గత యేడాదే పార్టీలో చేరిన వారికి పదవులు ఇస్తే తరతరాలుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారి పరిస్థితి ఏంటన్న వాదనలు రావడంతో అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఐదేళ్ల సీనియారిటీ ఉంటేనే నామినేట్ పదవులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొనడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గత రెండు నెలల క్రితమే ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొర్ర్రెడ్డి కిషన్ పేరును ఖరారు చేస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి పార్టీ అధిష్ఠానానికి పంపించారు. కానీ కొందరు సీనియర్ నేతలు ఆయనకు పదవి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. గత ఏడాది క్రితమే పార్టీలో చేరిన వారికి పదవులు ఎలా ఇస్తారంటూ ఫిర్యాదు చేయడంతో అధిష్ఠానం పెద్దలు డైలామాలో పడినట్లు తెలుస్తుంది. దీంతో చైర్మన్ నియామకంపై జాప్యం జరుగుతూ వస్తుంది. ఇప్పటికే చైర్మన్ నియామకంపై అధిష్ఠానం పెద్దలు స్పష్టత ఇవ్వడంతో కంది శ్రీనివాస్‌రెడ్డి మరో నేతకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే పార్టీలో మారుతున్న పరిణామాలతో ఎప్పుడు.. ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

పట్టు నిలుపుకునే ప్రయత్నం!

ఆదిలాబాద్ నియోజకవర్గంలో మరింత పట్టు నిలుపుకునేందుకు కంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీనియార్టీ విషయంలో కొర్రెడ్డి కిషన్ పేరును పక్కన పెట్టడంతో మరో నేత పేరు తెరపైకి వస్తుంది. జైనథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మునిగెల విఠల్ పేరును ఖరారు చేస్తూ అధిష్ఠానానికి పంపినట్లు తెలిసింది. అయితే ఆదిలాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ పదవి కోసం మరికొంత మంది సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలు సిఫారసు చేసిన వారినే అధిష్ఠానం ఫైనల్ చేసే అవకావం ఉన్న కాంగ్రెస్‌లో ఎప్పుడు.. ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితులు ఉంటాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఎలాగైనా తన అనుచరుడికే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇప్పించుకునేందుకు కంది అధిష్ఠానం పెద్దల వద్ద చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆదిలాబాద్ నియోజక వర్గంలో రెండు మూడు గ్రూపులుగా విడిపోయి పని చేస్తున్న నేతలు ఎవరికి వారే లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. పార్టీలో తమకున్న పరిచయాలు పలుకుబడితో నామినేట్ పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

గ్రంథాలయ చైర్మన్‌పై ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎంపికపై ఉత్కంఠ కనిపిస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, యువజన కాంగ్రెస్ నేత రంగినేని శాంతన్‌రావు, మరో నేత ప్రఫుల్ రెడ్డిల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు నేతలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అయితే గుడిపెల్లి నగేష్‌తో పాటు రంగినేని శాంతన్‌రావుకు కంది శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రఫుల్‌రెడ్డికి బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తుంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఎవరికి మద్దతు ప్రకటిస్తే వారిని ఫైనల్ చేసే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తుంది. నేతల సీనియార్టీ ఇన్‌చార్జీలా మద్దతును పరిగణనలోకి తీసుకుని జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమర్థవంతంగా ధాన్యం సేకరించండి

- మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి
- కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర పౌరసరఫరల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం సేకరణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా, సమర్థవంతంగా ధాన్యం సేకరణ జరిగేలా చూడాలని, సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో ప్రణాళికల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ధాన్యం శుభ్రపరిచే ప్యాడీక్లీనర్లు, క్యాలిపర్స్ ఇతర సామాగ్రి వెంటనే యుద్ధప్రాతిపదికన సమకూర్చాలన్నారు. దొడ్డురకం ధాన్యం సన్నరకం ధాన్యంతో కలువకుండా చూడాలని, సన్నరకం కొనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోను దొడ్డు రకం ధాన్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాలు, తప్ప పేరుతో రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలో కోతలు అమలు చేయకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కాంటా చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి నష్టం కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి సూచిం చారు. నాణ్యత ప్రమాణాలకను గుణంగా కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకు వచ్చేలా వారికి అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని మంత్రి సూచించారు. జిల్లాలోని రైతు మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పని సరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రైసుమిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉత్తర్వులు 27 పై చర్చించాలని, రైస్ మిల్లర్లతో బ్యాంక్ గ్యారంటీ తీసు కుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని పేర్కొ న్నారు. రైస్‌మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడి యట్ గోడౌన్లను ముందస్తుగానే గుర్తించాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక ఫోన్ నంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాలు చేయాలని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపు చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ఐకేపీ ద్వారా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శాంతినగర్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 3వ వారంలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు అంచనా 3400 మెట్రిక్ టన్నుల అంచనా అని, ఎంఎస్‌పీ రేట్ గ్రేడ్ ఏ 2320, కామన్‌గ్రేడ్ 2300 రూపాయలు, అదనంగా సన్న రకానికి రూ.500 రూపాయలు బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

లక్ష్మీపూర్ రిజర్వాయర్ కెనాల్ పుడిక తీయాలని వినతి



సాత్నాల డీఈ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న రూపెష్‌రెడ్డి

జైనథ్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ రిజర్వాయర్ కెనాల్ పూడికతీయాలని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌లోని సాత్నాల కార్యాలయాన్ని సందర్శించి సాత్నాల ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్‌తో మాట్లాడి వినతిపత్రాన్ని అందజేశారు. పూడిక తీయకపోవడంతో రైతుల పంట పొలాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. లక్ష్మీపూర్ రిజర్వాయర్ రైతులు పాల్గొన్నారు.

జడకొప్పుల ఆట ఆడిన కలెక్టర్, ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 02 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన జడకొప్పుల ఆట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులతో కలిసి, కలెక్టర్ ఎమ్మెల్యే జడ కొప్పుల ఆట ఆడి ఉత్సాహాన్ని నింపారు. అనంతరం కళాకారులను సన్మానించారు. ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కళాకారులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకం లక్ష్యాన్ని పూర్తిచేయండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న ఇందిరా మహిళా శక్తి పథకం అమలు తీరుపై శనివారం కలెక్టరేట్‌లలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్నిజిల్లాలో ఉన్న టార్గెట్‌ను నవంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలపై అడిగి తెలుసుకున్నారు. నవంబర్ నెలాఖరు లోగా లక్ష్యాలను సాధించాలని ఆదేశిం చారు. సమీక్షలో డీఆర్‌డీవో సాయన్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల మార్కెటింగ్‌పై అవగాహన

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ యాసంగి 2024-25 ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములు, డీలర్స్‌లకు తెలంగాణ విత్తనాల మార్కెటింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి తెలంగాణలో విత్తనాలపై సహకార సంఘ కార్యదర్శులకు, డీలర్లకు తెలంగాణ విత్తనాలపై అవగాహన సదస్సును శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షులు భోజారెడ్డి, డీసీఓ బి.మోహన్, బ్యాంక్ ఏడీసీసీబీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, ఏడీఓ శ్రీధర్ స్వామి, పీఏసీఎస్ అధ్యక్షులు సహకార శాఖ అసిస్టెంట్‌రిజిస్ట్రార్ నవీనకళ, డీటీ ఆత్మారం, ఆరతి రజనికాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఉట్నూర్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) ఖానాపూర్ నియోజక వర్గంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనడానికి ఓటుహక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తులు ఫాం-18, ఫాం-19 చూపబడిన ఫాం-18 పట్టభద్రులకు, ఫాం-19 ఉపాధ్యాయులు సంబంధించినవి కలవన్నారు. గడువు ఈనెల 6తో పూర్తవుతుందన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి విస్మరించారని సమగ్ర శిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు ఉద్యోగుల సమ స్యలను పరిష్కరించి క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పారన్నారు. కాని అధికారంలోకి వచ్చి హామీని మర్చిపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా ఈ హామీపై దాదాపు నాలుగుసార్లు ముఖ్యమంత్రిని కలవడం జరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వంలో, అధికారంలో కాని ఏ మాత్రం సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేసే ధోరణి కనిపించడం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ తక్షణం వర్గీకరించి అప్పటిలోగా కనీస బేసిక్ పేలని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 123 మంది వృత్తిలో ప్రాణాలు కోల్పోయిన సమగ్ర శిక్ష ఉద్యోగులదరికి కూడా తక్షనం రూ.10లక్షల బెనిఫిట్ అందించా లన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, అదే విధంగా మీరు న్యాయం చేయకపోవడం వల్ల ఇప్పుడు ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసి 20 వేల కుటుంబాల కోసం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నామన్నారు. తక్షణం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ టీచర్లకు హెల్త్‌కార్డులకు కృషి : ఎమ్మెల్యే బొజ్జుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ల సేవలను గుర్తిస్తూ ఆరోగ్య కార్డులు అందించేలా తనవంతుగా ప్రయత్నం చేస్తానని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉట్నూర్ డివిజన్ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా కార్యక్రమాలను సగభాగం ప్రైవేట్ పాఠశాలలో మోస్తున్నా యన్నారు.నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందన్నారు.ప్రైవేట్ ఉపాధ్యాయుల పై యజమా న్యాలు అజయ్ చేయకుండా ప్రేమతో పని చేయించుకుని వారి అవసరాలను తీర్చాలన్నారు.గతంలో రెండు మూడు మండలాలకు ఒక విద్యాధికారి ఉండేవాడని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చాక అన్నిమండలాలకు విద్య అధికారులను నియమించడం జరిగిందన్నారు. మండలంలోని ప్రభుత్వ విద్యా సంస్థలను కూడా చక్కగా నడిపించే బాధ్యత ఎంఈఓల పైనే ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ఐఏఎస్ ఐపీఎస్‌లను తయారు చేయాలన్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో పోటీతత్వం మరింత పెరగాలని, విద్య అవసరాలు తీర్చడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని, అవసరమైతే యజమాన్యాలను ముఖ్యమంత్రితో కలిసేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గొర్రెలనాగన్న, జిల్లా అధ్యక్షులు రంగినేని పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, ఎంఈఓలు ఆశన్న, రాథోడ్ అనిత, మనుకుమార్, మనోహార్‌లతో పాటు సాడిగే రాజగోపాల్, షబ్బీర్, రాము, బొల్లిగన్నే రాజేశ్వర్, రైస్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌చార్జీల పెంపుదలపై విద్యార్థుల హర్షం

ఉట్నూర్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : డైట్ చార్జీల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉట్నూర్ లాల్‌టెకిడి గురుకుల జూనియర్ కళాశాల, కొమురంభీం ప్రాంగణంలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాల గిరిజన విద్యార్థులు సీఎం చిత్రపటాలను చేత పట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు.

చైర్మన్‌కు ఘనస్వాగతం

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విత్తనాల మార్కెటింగ్‌పై అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (టీజీఎ స్‌డీసీ) చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకెట అన్వేష్‌రెడ్డిని మావల వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కాసన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఇందులో మావల మం డల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జల్లా ఉపాధ్యక్షులు తాదిసేన వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, సీనియర్ నాయకులు, నలిమేల నవీన్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కోరటి ప్రభాకర్, కుదురుపాకసురేష్, బాలకృష్ణ, గౌతమ్, కిరణ్, అడెల్లు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో చోరీ

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన మావలలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. క్వింటాలున్నర బియ్యం, 12 ఫ్యాన్లు, 12 ట్యూబ్‌లైట్లు, పాఠశాలలోని విద్యుత్ స్విచ్ బోర్డులు, 20 కేజీలు బియ్యం వండే మూడు గంజులు, ఇతర సామాగ్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ రెడ్డి, మావల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని డీఈఓ ప్రణీత పరిశీలించారు.

డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని నిరసన

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024 నియామకాల్లో డీఈఓ కార్యాలయంలో అక్రమాలు జరిగాయని, అనర్హులకు పోస్టింగ్ ఇచ్చి విధుల్లో చేరిన అభ్యర్థులకు అన్యాయం చేశారని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తలమడుగు మండలంలోని కుచులాపూర్‌లో ఉపాధ్యాయుడిగా నియామకమైన నవీన్ యాదవ్‌ను రోస్టర్‌లో దొర్లిన పొరపాటుతో సర్వీసు తొలగిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు యాదవులు, తాంసి మండలకేంద్రం గ్రామస్థులు డీఈఓ కార్యాలయం వచ్చి వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత కలెక్టర్ రాజర్షి షాను కలిసి అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. సంఘం నాయకులు హన్మాండ్లు యాదవ్, నారాయణ యాదవ్, రామన్న యాదవ్, ప్రఫుల్, దేవారెడ్డి, రవికాంత్, మాజీ సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలో రణదివ్యనగర్ నకిలీ ఎల్ఆర్ఎస్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో డాక్యుమెంట్ రైటర్లకు ఎలాంటి సంబంధం లేదని, కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు ద్వారా డాక్యుమెంట్ రూపొందించారని దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు ఖదీర్ తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వీరికి రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

బుద్దిస్ట్, మహార్‌లకు ప్రభుత్వం పెద్దపీట వేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్


ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో షెడ్యూల్డు కులాలు బౌద్దులుగా మారిన వారికి షెడ్యూల్డు కులముగానే రిజర్వేషన్లు కల్పిస్తూ జారీచేసిన కేంద్ర ప్రభుత్వం జీవోను ప్రతిఒక్కరూ తమ మతంను బుద్దిస్ట్, అలాగే కులమును మహార్‌గా చేర్పించే విధంగా చూడాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బౌద్దుల సంఖ్య అధికంగా ఉందన్నారు. బుద్దిస్టు, మహార్‌లకు తెలంగాణలో రాజకీయంగా, ఆర్థికంగా, అన్ని రంగాల్లో వెనుక ఉన్నామని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్దిస్ట్, మహార్‌లకు పెద్ద పీట వేయాలని కోరారు. అనంతరం ఆదిలాబాద్ ఆర్డీఓకి వినతిపత్రం అందించారు. ఇందులో నాయకులు పోటఫోడే దయానంద్, కాంతరావు, వాఘమారే ఖుషివర్త లాండ్గే, భలేరావురాం దాస్, భీంరావ్‌వాగమారే, దయానంద్‌కాంబ్లె,దయాశీలహుక్కే, సవితకక్టే, మాయవతి ససానే తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు సహకరించాలి

- అసెంబ్లీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి గ్రామాలలో కులగణన కార్యక్రమం ప్రారంభమవుతుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచన, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఆదేశాల మేరకు కులగణన పై క్షేత్ర స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్, క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్యనాయకులతో కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శనివారం డీసీసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమం పై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్ రావుపాటిల్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి పితృవియోగం


జువ్వాడి సూర్యారావు (ఫైల్)

నిర్మల్ అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి తండ్రి జువ్వాడి సూర్యారావు (80) శనివారం సాయంత్రం మృతిచెందారు. కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సూర్యారావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మాజీ మంత్రి రత్నాకర్ రావు సోదరుడైన సూర్యారావు గతంలో జిల్లా పరిషత్ సభ్యుడిగా పని చేశారు. నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరిరావుకు ఆయన మామ. కాగా ఆదివారం ఉదయం 10 గంటలకు తిమ్మాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఏటీఎంలో చోరీయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్ లైన్‌లోని ఏటీఎంలో శనివారం తెల్లవారుజామున చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. వివరాలు వెల్లడిస్తూ కెనరా బ్యాంక్ మేనేజర్ 100 నెంబర్‌కు డయల్ చేసి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడుతున్నట్లు తెలియజేశాడన్నారు. ఏటీఎం కేంద్రానికి పెట్రోలింగ్ సిబ్బందితో కలిసి సీసీ ఫుటేజ్ పరిశీలించామని తెలి పారు. సమీప ప్రాంతాల్లో వెతుకగా బస్టాండ్ దగ్గర వెల్మల్ బొప్పారం గ్రా మానికి చెందిన వ్యక్తి కుంచె గంగాధర్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించి నిం దితుడిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్‌ను ఎస్పీ జానకీషర్మిల ప్రశంసించారు. డయల్ 100 ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

తానూర్, నవంబరు 2 : మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన గాడేకర్ నాగోరావు(50) అనే వ్యక్తి మనస్తాపంతో ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వివరాల ప్రకారం... మృతుడు నాగోరావు గత కొద్ది రోజులుగా మద్యానికి అలవాటు పడ్డాడు. అయితే మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మృతుని భార్య వందన దీపావళి పండుగ కోసం తల్లిగారింటికి వెళ్లింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయం చూసి నాగోరావు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా ఉదయం మృతుడి భార్య ఫోన్ చేసిన ఫోన్ లేపక పోవడంతో పక్క ఇంటి వారికి ఫోన్ చేసి ఇంట్లో చూడాల్సిందిగా కోరింది. వారు ఇంట్లోకి వెళ్లి చూసే సరికి నాగోరావు ఫ్యాన్‌కు వేలాడుతు కనిపించాడు. ఈ మేరకు భార్య వందన ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు.


కమ్మేసిన పొగమంచు

ఫొటో న్యూస్!!


భైంసాలో దట్టమైన పొగమంచుతో నిండుకుపోయిన బస్సు డిపో

భైంసా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న వాతావరణ పరిస్థితులతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలితీవ్రత రోజురోజుకు అధికమవుతోంది. శనివారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 6 గంటల ప్రాంతంలో అరంభమైన పొగమంచు బెడద 8 గంటల వరకు కొనసాగింది. దీంతో రెండు గంటల పాటు జనాలు పొగమంచుతో తంటాలు పడ్డారు. రోడ్లు దట్టమైన పొగమంచుతో కమ్ముకు పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలిగాయి. హెడ్‌లైట్ వేసుకొని వాహనాలు నడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చోదకులు వాహనాలను నడిపేందుకు గాను అగచాట్ల పాల య్యారు.

దిలావర్‌పూర్ : మండలంలోని గ్రామాలన్నింటిని శనివారం పొగ మంచు కప్పేసింది. తెల్లవారు జామునుంచే పంట పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడ్డారు. ఏమి కనిపించకపోవడంతో పంట పొలాలకు వెళ్లలేకపోయారు. ఉదయం ఎనిమిది గంటలైనా పొగమంచు తొలగిపోలేదు. పొగమంచుతో వాహనదారులకు ఇబ్బంది తప్పలేదు. ముందు వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకోవాల్సి వచ్చింది.


పొగ మంచులో గుండంపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం


భైంసా ప్రాంతంలో దట్టమైన పొగమంచు

ముగిసిన గుస్సాడీ, దండారి ఉత్సవాలు

ఇంద్రవెల్లి , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆది వాసీ గిరిజన గూడేల్లో పదిరోజుల పాటు నిర్వ హించిన దండారి ఉత్సవాలు శనివారం ముగి శాయి. చివరిరోజు గూడేల్లో గుస్సాడీలు డప్పుచ ప్పుళ్ల నడుమ నృత్యాలు చేశారు. అనంతరం గుస్సాడీ దండారి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామపటేళ్ళ ఇళ్ళ ఎదుట గుస్సాడీ వేషధారణ వస్తువులు ఉంచి ఏత్మాసూర్ దేవతకు పూజలు చేశారు. గుస్సాడీలను గ్రామ పొలి మేర వరకు సాగనంపారు. పొలిమేరలోని ఇప్పపువ్వు చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతలకు మహిళలు గారెలు, నైవేద్యాలు సమర్పించారు. గుస్సాడీలకు స్నానం చేయించడంతో ఉత్సవాలు ముగిశాయి. దీంతో గుస్సాడీ దండారి ఉత్సవాలు ముగిసినట్లు గ్రామపటేల్, మహాజన్ ప్రకటించారు. కార్యక్రమంలో డోంగర్‌గావ్ గ్రామ పటేల్, పెందోర్ బాధు, మహాజన్ ఆర్కా తద్మ రావు, దేవరి పెందోర్ భీంరావు, పెందోర్ లింబా జీ తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండలంలోని ఆదివాసీ గూడాలలో వారం రోజుల నుంచి అంగరంగ వైభవంగా సాగిన దండారి పండుగ శనివారం కొలబోడి కార్యక్రమంతో ముగిసింది. గుస్సాడి నృత్యాలు, డప్పుల దరువులతో గజ్జెల మోతలతో రేలా పాటలతో చచ్చోయ్ చెబెయ్ అంటూ కోలాటంతో ఆదివాసీ గూడాలలో గుస్సాడి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం ఆది వాసీలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దైవం ఏత్మసూర్ దేవత పేరున జరిగే పండుగ దండారి పండుగ. ఇతర గ్రామాలకు దండారిలు వెళ్ళడం, ఇతర గ్రామాల నుంచి వారివారి గ్రామాలకు ఇతర గ్రామాలకు దండారీలను అతిథిగా పిలవడం వంటి సకల మర్యాదలతో వారికి స్వాగతం పలుకుతూ సాంప్రదాయ నృత్యాలు చేశారు. దండారి పండుగ కొలబోడి పండుగతో ముగిసింది. కార్య క్రమంలో పటేల్ భీం రావు, దేవరి భూమన్న, మహాజన్ హన్మంతు, ఆదివాసీ యూత్ అధ్య క్షుడు ఆత్రం సిడాం సుభాష్, యువతీ, యువకులు, గ్రామస్థులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

భోథ్ : వారం రోజులుగా ఆదివాసి పల్లెలు గుస్సాడీ నృత్యాలతో పగలు, రాత్రి ఉత్సా హంగా మారు మోగాయి. గుస్సాడీల సందడితో పలు గ్రామాల నుంచి వచ్చిన బంధు వులతో గిరిజన గూడెం కళకళలాడాయి. తమ పొలం పనులకు స్వస్తి పలికి ఆదివాసిలు తమ పల్లెలకు పరిమితమయ్యారు. గుస్సాడీ సందడి దీపావళి తరువాత రోజు అయినా శనివారంతో ముగిసి పోయాయి. కోళ్ళ బోడి పండుగను చేసిన గుస్సా డీలు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటి ల్లిపాది గుస్సాడీల దగ్గరకు వచ్చి ప్రత్యేక పూజ లు చేసి నైవేద్యాలు సమర్పించారు. దీంతో గుస్సాడీ పండుగ ముగిసింది.


వేషాల సామాగ్రిని తీసి వేస్తున్న గుస్సాడీలు

నార్నూర్ : అడవుల జిల్లాఉమ్మడి మండలాలైనా ఆదివాసుల పెద్దపండుగ దండారి, గిరిజనుల తీరు ప్రత్యేకం వారి ఆచార వ్యవహారాలు సంస్కృతి సాంప్రదాయాలు బిన్నంగా ఉంటాయి. నార్నూర్ మండలం ముక్తాపూర్‌గోండు గూడలో దండారి ఉత్సవాలు డప్పుల దరువులు, గజ్జల మోతలు, గుస్సాడి నృత్యా లతో గిరిజన గూడెలు మురిసిపోతున్నాయి. దండారి అంటేనే ఆదివాసీ గుడెల్లో సంబరాల వేడుక అత్యంత భక్తి శ్రద్ధలతో కొల్చే ఆరాధ్య దేవత యత్మాసార్ పెయిన్ పేరిటా చేసే ప్రత్యేక పండుగ. దండారి ఉత్సవాలు పక్షం రోజుల పాటు సాగే ఈ వేడుక తరతరాలు సాంప్రదాయాన్ని కొనసాగించే అత్యంతర అద్భుత పండుగగా నిలుస్తుంది. తల్లి ఒడిలో అంగరంగ వైభవంగా సాగే దండారి పండుగ ఆచార వ్యవహారాలు సంస్కృతి, సాంప్రదాయాలు కట్టుబొట్టు రూపాలేంటో ఓసారి ఉమ్మడి మండలంలోని గిరిజన గూడెలలో ఓసారి చూసొద్దాం. ఇప్పుడు ఎక్కడ చూసినా తుడంమోతాలు డప్పుల చప్పుడు గుస్సాడి నృత్యాలు ఆట పాటలే కనువిందు చేస్తాయి.ఆదివాసీ గూడెలు రారా రమ్మంటూ స్వాగతం పలుకుతాయి. ఓ వైపు కోలాటాలు మరో వైపు గోండి పాటల నృత్యాలు హస్య నాటికల ప్రదర్శనలు అబ్బురపరుస్తాయి. అసవయుజ పౌర్ణమి అనంతరం ప్రారంభమయ్యే ఈ దండారి ఉత్సవాలు పక్షం రోజుల పాటు కొనసాగుతాయి. దండారి వేడుకల్లో గుస్సాడిలదే కీలకపాత్ర వారి వేషాధారణ ఇతరులను ఆకట్టుకుంటుంది. నెత్తిపై నెమలి పింఛం, ఆపించానికి ఇరువైపుల దుప్పి కొమ్ములు పింఛం మధ్యలో తలక్కున్న మెరిసే అద్దం భుజానికి జింక తొలు నడుమ కాళ్లకు గల్లు గల్లున మోగే గజ్జలు మెడలో శివయ్య రుద్రమల ఒంటినిండా బూడిద ముఖానికి నల్లని రంగు ఇలా విచిత్ర వేషాధారణతో కనిపించే వీరిని గురు అని ఆదివాసీ దేవుని ప్రతి రూపమని పిలుస్తుంటారు.ఈ కార్యక్రమంలో సిడాం భోజ్జుపటేల్, సిడాం కేశవ్ పటేల్, సిడాంహాజ్ దేవాది, పుర్కభీమ్‌రావు, కారోబారి, సోయంజుగాదిరావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్టివేత

నర్సాపూర్(జి), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని అర్లి(కే) ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం మండల విస్తరణ అధికారి చెంద్యాల గణేష్ నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. మండల వ్యవసాయ అధికారి చెంద్యాల గణేష్ శనివారం మధ్యాహ్నం అర్లి(కే) ఎక్స్‌రోడ్డు వద్ద భైంసా మండలం చాత గ్రామానికి చెందిన చందుల మహేష్ విత్తనాలను ద్విచక్ర వాహనంపై తీసుకెళుతుండగా అనుమానం వచ్చి మాట్లాడాడు. బ్యాగులపై బ్యాచ్ నెంబర్ లేకపోవడంతో పయనీర్ కంపెనీ ప్రతినిధి చంద్రకాంత్‌ను పిలిపించాడు. మొక్కజొన్న బ్యాగులకు వాటిపై ఉన్న క్యూఆర్ కోడ్‌పై స్కాన్ చేయగా వివరాలు రాలేదు. అధికారి చంద్యాల గణేష్ 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే నర్సాపూర్(జీ) పోలీసు సిబ్బంది వచ్చి నింది తుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అధికారి పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుకున్న మొక్కజొన్న విత్తనాల విలువ రూ.71 వేల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 30 బ్యాగు లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పయ నీర్ కంపెనీ ఒరిజినల్ బ్యాగు ధర 1900లు మార్కెట్‌లో ఉంది. ఈ నకిలీ విత్తనాల బ్యాగులపై 2,392 ఉం డడంతో అసలు విషయం బయటపడినట్లు తెలిసింది.


పట్టుబడిన నకిలీ విత్తనాలు

అనుమానాస్పదంగా బావిలో పడి బాలుడి మృతి

- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా బాలుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని అనంతపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపూర్ గ్రామానికి చెందిన తోడసం నాగోరావు, ఇస్రుబాయి దంపతులకు చెందిన చిన్న కొడుకు తొడసం లాల్‌షావ్ (11) మండలంలోని వడగామ్ ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం చేన్ ఉన్న ఎడ్లను తీసుకురావాలని తండ్రి నాగోరావు చెప్పడంతో చేన్‌కు వెళ్లిన బాలుడు లాల్ షావ్ రాత్రి అయిన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు చుట్టూ పక్కల వ్యవసాయ చేన్లతో పాటు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గాలించిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం సమీప చేన్‌లో గల బావిలో మృత దేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై దుబ్బాక సునీల్ ఘటన స్థలానికి చేరుకుని బావిలో పడి బాలుడి మృతికి గల కారణాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన కొడుకు ఈత వస్తుందని మృతిపై అనుమానం ఉందని తండ్రి తొడసం నాగోరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి బాలుడు లాల్ షావ్ మృతిపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా దీపావళి పండుగకు వచ్చిన తమ కొడుకు బావిలో పడి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అనంతపూర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.

న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం విజయవంతం చేయండి

నిర్మల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహా రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే బాధ్యత అధికారులదే అన్నారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమ అమలుకు వాలంటీర్లను గుర్తించాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. నిరక్షరాస్యుల వివరాలు, వాలంటీర్లను గుర్తించామని వివరించారు. డీఈవో రవీందర్ రెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి పరుశరాం,నరసింహమూర్తి పాల్గొన్నారు.

కస్బా శ్మశాన వాటికలో పరిశుభ్రత పనులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం 29వ వార్డు కస్బాలోని ముస్లింల శ్మశాన వాటికలో శనివారం పరిశుభ్రత పనులు నిర్వహించారు. కౌన్సిలర్ ముజాహిద్ అలీ విజ్ఞప్తి మేరకు అక్కడ మున్సి పల్ సిబ్బంది జేసీబీ, బ్లేడ్‌ట్రాక్టర్‌తో చెత్తా చెదారాన్ని తొలగించారు. కమి షనర్ ఖమర్ అహ్మద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, ఎంఐఎం ప్రధాన కార్యదర్శి సయ్యద్ మజహర్, రఫీక్ అహ్మద్ ఖురేషి, సాబీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

సారంగాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన టి.మాధవ్(21) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాధవ్ శనివారం ఉదయం స్నేహితులతో కలిసి బయటకి వెళ్లి వస్తానని తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు పాటు పడండి

- ఏఎస్పీ అవినాష్‌కుమార్

తానూర్, నవంబరు 2 : మండలంలో నేరాల నియంత్రణకు పాటు పడి శాంతిభద్రతలను కాపాడాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని శాంతిభద్రతలపై ఎస్సై రమేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్, సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహణ కల్పించాలన్నారు. పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. అనంతరం పోలీస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.


మొక్కలు నాటుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

ఘనంగా సదర్ ఉత్సవాలు

- అహుతులను అకట్టుకున్న ప్రదర్శన

భైంసా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాణబజార్, గణేష్ నగర్ కాలనీల పరిధిలో శనివారం సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో పురాణ బజార్, పాడి రైతుల ఆధ్వర్యంలో గణేష్ నగర్ కాలనీల పరిధిలో జరిగిన సదరు ఉత్సవాలకు అధిక సంఖ్యలో జనాలు హజరయ్యారు. యాదవ కులస్తులు, పాడి రైతులు తమ తమ దున్నపోతులను శోభయమానంగా ఆలంకరించి ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం దున్నపోతులతో చేపట్టిన విన్యాసాలు, ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, టౌన్ సీఐ గోపినాథ్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గంగాధర్, గణేష్ నగర్ ప్రతినిధులు తూమోల్ల దత్తు, వడ్నపు శ్రీనివాస్, పెరుగు నవీన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఆధ్వర్యంలో పాడి రైతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న పాడి రైతులు

సూర్యాపూర్ శివారులో పులి సంచారం

కుంటాల, నవంబర్, 2 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని సూర్యాపూర్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు శనివారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. శుక్రవారం మండలంలోని సూర్యా పూర్ అటవీ ప్రాంతంలో వెళ్లిన పశువుల కాపరి తెలిపిన వివరాల ప్రకారం కోడె దూడపై దాడి చేసిన పులి పశువుల కాపరి చెట్టుపై ఎక్కడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు శుక్రవారం రాత్రి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా శనివారం ఉదయం గుర్తించిన అధికారులు మహారాష్ట్ర కిన్వట్ ప్రాంతం నుంచి వచ్చిన మగపులి వయ స్సు 6-7 సంవత్సరాల మధ్య ఉంటుందని గుర్తించారు. గ్రామస్తులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు మాత్రమే పంట పొలాలకు వెళ్లాలని, ఒంటరిగా వెళ్లకూడదని, వెళ్లే రైతులు చేతిలో కర్రతో పాటు కర్రకు గజ్జెలు ఏర్పాటు చేసుకొని వెళ్లాలని సూచిం చారు. శనివారం ఘటనా స్థలాన్ని ఎఫ్ఆర్‌వో వేణు గోపాల్, ఎఫ్ఎస్‌వో కీర్తిరెడ్డి, ఎఫ్‌బీవో హరిలతలు సందర్శించారు.

బోథ్ : గత నాలుగు రోజుల క్రితం వరకు ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, నేరేడిగొండ అడవుల్లో సంచరించిన పెద్దపులి తాజాగా నిర్మల్ జిల్లాలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో నుంచి ఆదిలాబాద్ జిల్లా చేరుకున్న పులి బోథ్ అడవుల్లో అలజడి సృష్టించి పశువులపై దాడులు చేసింది. అయితే పులి సంచారంతో అటవీ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. తమ పంట చేలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురయ్యారు. తీరా ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులు దాటి ఆడెల్లి పోచమ్మ అటవీ ప్రాంతం సమీపంలో నుంచి కుంటాల నిర్మల్ జిల్లాలోకి ప్రవేశించింది. అయితే అక్కడ సైతం పులి ఆవులపైన దాడి చేసినట్లు సమాచారం. ఏది ఏమైనా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పత్తి పంటను ఏరేందుకు వచ్చిన మహారాష్ట్ర కూలీలు

అన్నదాత.. ఆగమాగం

● పెరిగిన పెట్టుబడి - తగ్గిన దిగుబడి ● రైతు బంధు లేదు ● స్థానిక కూలీలు లేరు


మహారాష్ట్ర కూలీలు తీసుకువచ్చిన ఆటో

బోథ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పది మందికి అన్నంపెట్టి ఆదుకునే రైతన్న జీవితం ఆగమాగం అవుతుంది. ఏడాదికేడాది రైతుల పరిస్థితి దయ నీయంగా మారుతుంది. పట్టెడన్నం పెట్టే రైతన్న అన్నమో రామచంద్ర అనే స్థితి కి ప్రకృతి దిగజారుస్తుంది. ప్రకృతి కన్నెర్ర చేయడంతో పంట దిగుబడి తగ్గుతూ వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది అవసరం ఉన్న సమయంలో వర్షాలు కురవక పోవడంతో పత్తి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. మరో వైపు సోయాబీన్ పంట దిగుబడి సైతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఆం దోళన వ్యక్తపరుస్తున్నారు

● **పెరిగిన పంట పెట్టుబడులు..**

ఏడాదికి ఏడాది పురుగు మందుల ధరలతో పాటు కూలీల రేట్లు పెరిగిపోవడంతో రైతు లు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండటంతో మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలే దిక్కవుతున్నారు. మొదటి కూలీ రేట్లు తక్కువగా తీసు కున్న కూలీలు క్రమక్రమంగా కూలీ ధర పెంచుతూ వస్తు న్నారు. గత్యంతరం లేక రైతులు మహారాష్ట్ర కూలీలతోనే పని చేయించుకోవాల్సి వస్తుంది. కిలో పత్తికి రూ.8 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. గిట్టుబాటు కాకుండా తప్పనిసరి పరిస్థితుల్లో మహారాష్ట్ర కూలీలను వినియోగించుకుంటున్నారు.

● **రైతు బంధు కోసం ఎదురు చూపులు..**

రైతులు ఏడాది సరైన పంట దిగుబడి లేక చేతిలో చిల్లిగవ్వ లేకుండా రైతు బంధు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ రబీ పంటలకు సంబంధించిన పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రైతు బంధు పెంచి ఇస్తారని ఆశతో ఉన్న రైతన్నకి నిరాశ మిగిలింది. మరో వైపు సోయాబీన్ పంట విక్రయించిన రైతులకు సకాలంలో అందించినట్లయితే ఆసరాగా ఉంటుం దని రైతులు అంటున్నారు.

తాంసి: తెల్ల బంగారాన్ని నమ్ముకొని పత్తి పంటను సాగు చేసిన రైతాంగానికి ఈ యేడు దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. కనీసం ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. దీంతో రైతుల మొ హాల్లో నవ్వు కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం నాలుగు లక్షల 31 వేల పైచిలుకు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. తాంసి మండలంలో 28 వేల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారు. మొదట్లో వర్షాలు పంటలకు అనుకూలంగా కురిసినప్పటికీ గత 40 రోజుల నుంచి వర్షాలు మొండికేయడంతో చేతికి వచ్చే సమయంలో పత్తి పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని చెప్పవచ్చు.



పూర్తిగా ఎండిపోయిన పత్తి పంట పొలాలు



ఎండిపోతున్న పొలంలో పత్తి ఏరుతున్న కూలీలు

● **ఎకరాకు సుమారు 40 వేల రూపాయల ఖర్చు**

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం పెట్టుబడి గణనీయంగా పెరిగింది. ఎకరాకు సుమారు 30 నుంచి 40 వేల రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇక కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి అయితే ఎకరానికి రూ.70 వేల ఖర్చయింది. ఈ లెక్కన ఐదు క్వింటాళ్ళ దిగుబడిని లెక్కలోకి తీసుకుంటే పెట్టిన పెట్టుబడి సైతం చేతికి రావడం లేదని అంటున్నారు. దీంతో ఈ సంవత్సరం ఏ ఒక్క పండు గను రైతులు ఆనందంతో జరుపు కోలేదంటే అందులో ఎలాంటి అతి శయోక్తి లేదు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో అదే ఇబ్బందుల్లో తలమునకలవుతున్న తరుణంలోనే పత్తి దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో ప్రస్తుతం రైతు పరిస్థితి మూలిగే నక్కపై తాటికయ పడిందన్న చందంగా మారింది.

● **సతాయిస్తున్న కరెంట్**

కొంత మంది రైతుల పంట పొలాల్లో నీటి సౌకర్యం ఉన్నప్పటికీ కరెంట్ సతాయిస్తుండటం వల్ల పంటలకు నీళ్లు పెట్టలేక పోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. నీళ్లుండి పెట్టుకోలేక పోవడంతో మరింత నష్టపోయామని తాంసి మండల రైతులు పేర్కొంటున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో కూడా తెలియడం లేదని పలు రైతులు పేర్కొంటున్నారు.

● **గిట్టు బాటు కరువు..**

అసలే ఈ ఏడు ఆశించిన దిగుబడులు రాలేదు. మార్కెట్‌లో ప్రభుత్వం ముందుగా క్వింటాల్‌కు పది వేల వరకు ఉంటుందని ఆశ పడితే ప్రస్తుతం మార్కెట్‌లో 6 వేల నుంచి 6,500 లోపే కొనుగోలు చేస్తుండ టంతో గిట్టుబాటు కరువవుతుంది. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ వ్యాపారస్తులు ఎంతకు కొంటే అంతకు అమ్మాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని పత్తి రైతులు వాపోతున్నారు. తమను ప్ర భుత్వమే ఆదుకోవాలని పత్తిరైతులు కోరుతున్నారు.

● **పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి**



వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు పంట నష్టం సంభవించిందని సర్వే నిర్వహించి పంట నష్ట పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో దాదాపు ఇటీవల కురిసిన వర్షాల వల్ల రెండు వేల ఎకరాల వరకు పంటలు చెడిపోయాయని ప్రభు త్వం రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. లేకుంటే రైతు ఆత్మహత్యలు పెరిగే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. రైతుల దీనస్థితిని పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

\- సంగేపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు

● **నిండా మునిగిపోయాం..**



తనకున్న 12 ఎకరాలలో ఈ ఏడు పత్తి పంటను సాగు చేశాను. ప్రస్తుతం పత్తిని చూస్తే ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా రాకపోవచ్చు. పెట్టిన పెట్టుబడుల్లో కనీసం సగం వరకైనా చేతికి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. పత్తిని తీసుకునే మార్కెట్‌కి వెళితే ప్రైవేట్ వ్యాపారస్తులు తేమ పేరుతో ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వంసైతం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరంగా ఉంది.

\- విలాస్‌రెడ్డి, రైతు, తాంసి

పర్యాటక అభివృద్ధికి నోచుకోని

జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం


జైనథ్‌లో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి విగ్రహం


లక్ష్మీనారాయణ స్వామి ఆలయం

ఆంధ్రజ్యోతి పరిశీలన


శిథిలావస్థలో గల శివాలయం

జైనథ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి పద్దెని మిది కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన జైనథ్‌లో గల శ్రీ లక్ష్మి నారాయణ స్వామి ఆలయం దశాబ్దాలు గడుస్తున్నా నేటికి పర్యాటక అభివృద్ధికి నోచుకోవడం లేదు. లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని 13వ శతాబ్ధంలో జైనూలు మహారాష్ట్ర ప్రాంతాన్ని జయిం చేందుకు ఈ ఆలయాన్ని బసదిగా నిర్మించు కొన్నారు. అనంతరం 14వ శతాబ్ధం కాలంలో వచ్చిన పల్లవులలో శ్రీముఖ శాతవాహనుడు ఈ ఆలయాన్ని శివుడు, వివిధ దేవత మూర్తులు, వివిధ భంగిమలతో చెక్కించి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఆలయాన్ని ఒక్క రాత్రిలోనే నిర్మించారు. ఈ ఆలయం చరిత్ర సూర్యనమ: శ్లోకంతో ప్రారంభ మవుతుంది. కాగా ఆలయం పక్కన గల శివాలయం నేటికి శిథిలావస్థలోనే ఉంది.

● **పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు**

● **ప్రతిపాదనలకే పరిమితమైన టూరిజం శాఖ**

ఆలయ ప్రత్యేకత..

స్వామి కల్యాణోత్సవంలో చెరువు స్నాం చేసి గరుడముద్దను తింటే సంతానం లేని స్త్రీలకు సంతానం కలుగును. స్వామివారం సందర్శి వెళ్తే కోర్టుల్లో విజయం లభిస్తుంది. దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయి.

కనీస వసతుల కరువు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వందలాది మంది దర్శనానికి వస్తుంటారు. వారికి కనీస వసతులైన మంచినీటి సౌకర్యం టాయిలెట్లు మరుగుదొడ్లు, అవాస వసతులు లేక భక్తులు పడరాని పాట్లు పడుతుంటారు. 2004లో అప్పటి జిల్లా కలెక్టర్ వికాస్‌రాజ్ దేవదాయ శాఖ నుంచి టూరిజం పర్యాటక శాఖలోకి తీసుకు వచ్చిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందసంగా ఆలయ పరిసరాలు ఉన్నాయి.

అభివృద్ధికి ప్రతిపాదనలు

● పెండలవామన్‌రావ్, ఈఓ



ఆలయ అభివృద్ధికి రూ.10కోట్ల వ్యయంతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో చెరువు సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టం, గెస్ట్ హౌజ్‌ల నిర్మాణం వంటివి ఉన్నాయి.

పశువులకేదీ బీమా..?!



● ఆరేళ్లుగా నిలిచిన పథకం ● నష్టపోతున్న పశు పోషకులు ● పట్టించుకోని జిల్లా అధికారులు

బజార్‌హత్నూర్, నవంబరు 2: రైతు సంక్షేమంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్న ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మారుతున్నాయి. పాడి పరిశ్రమను ఆధారంగా చేసుకుని ఎన్నో కుటుంబాలు జీవిస్తున్న పాడి పశువుల సంరక్షణకు మాత్రం ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా లక్షలాది రూపాయలు పెట్టి పశువులను కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటికి బీమా సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలం అవుతుంది.

జిల్లాలో పశువుల బీమా అమలు కాకాపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వ్యవసాయం తరువాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించే వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం చేయూతను అంది స్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

ఆరేళ్లుగా నిలిచిన బీమా సౌకర్యం

పశుబీమా పథకాన్ని 2017, 2018 వరకు గత ప్రభుత్వం అమలు చేసిది. ఆరేళ్లగా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు రోడ్డు, విద్యుత్, ప్రమాదాలు, అనారోగ్యం, కారణంగా చనిపోతున్నాయి. మేలు జాతి పశువులకు రూ.లక్షల్లో డిమాండ్ ఉంది. అనివార్య కారణాలతో పశువులు మృతి చెందితే రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. గతంలో బీమా కోసం యజమాని కొంత చెల్లిస్తే ప్రభుత్వం కొంత మొత్తం జమ చేసేది. ఏదైనా ప్రమాదంలో జీవాలు చనిపోతే ఆయా సంస్థల నుండి గతంలో పశువుల రకాన్ని బట్టి రూ.50వేల వరకు పరిహారం అందేది. దీంతో పశువులు మృత్యువాత పడిన వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకుని భరోసగా ఉండేవారు. ప్రస్తుతం ఈ పథకం నిలిచి పోవడంతో వివిధ కారణాలతో పశువలు చనిపోతే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

యేటా జీవాల మృతి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 547969 పశువులు, ఇతర జంతువులు ఉన్నాయి. యేటా వందల కొద్ది పశువులు అనారోగ్యం, పిడుగులు పడి రోడ్డు, ప్రమాదాల్లో మృతి చెందుతున్నాయి. పలు మార్లు లంపిస్కిన్ తదితర వ్యాధులు సోకి ఆవులు ఎద్దులు మృత్యువాత పడుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల పథకం పంపిణీలో పంపిణి చేసిన గొర్రెలకు మాత్రమే బీమా సథకం వర్తింపజేసింది. ప్రస్తుతం గొర్రెలు, ఆవులు, ఎద్దులు, గేదెలకు బీమా సదుపాయం లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రైవేటు కంపెనిలను ఆశ్రయించి బీమా చేయించాలంటే సుమారు రూ.50వేలు పశువుకు రూ.4వేలు ఖర్చు అవుతుందని వాపోతున్నారు.

జిల్లాలో పశు సంపద వివరాలు

ఆవులు	3,11,182
గొర్రెలు	1,53,214
గేదెలు	48,650
మేకలు	1,86,469
ఇతర పశువులు	6,205

బీమా పథకాన్ని పునరుద్ధరించాలి..

● చట్ల చిన్నయ్య రైతు బజార్‌హత్నూన్

జిల్లాలో పశువులకు బీమా పథకాన్ని పునరుద్ధరించాలి. బీమా కోసం ప్రైవేటు కంపెనీలను ఆశ్రయిస్తే డబ్బులు అధికంగా ఖర్చు అవుతున్నాయి. ప్రైవేటుగా బీమా పథకం చేయించుకోకపోవడం వల్ల పశువులు మృత్యువాత పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతుల వాటా కలుపుకుని బీమా పథకాన్ని తిరిగి పునరుద్దరించాలి.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

● పర్వేజ్ అహ్మద్, పశు వైద్యుడు

ప్రభుత్వం పంపిణీ చేసిన పథకాల్లో లబ్ధిదారులు పొందిన పశువులకు యూనిట్ విలువ నుండి బీమా సదుపాయం కల్పించింది. రైతుల వద్ద ఉన్నా పశువులకు బీమా పథకం కల్పించ లేదు. ప్రైవేట్‌గా బీమా చేసుకుంటే నష్టం జరిగినప్పుడు పరిహారం అందుతుంది. కొత్త ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేస్తే పశువులకు బీమా సదుపాయాన్ని కల్పిస్తాం.

ప్రారంభం సరే..

కొనుగోళ్లు ఎప్పుడు?!

కుంటాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే ఉద్ధేశంతో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభు త్వం డీసీఎంఎస్, కోఆపరేటివ్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభిస్తుంది. ప్రారంభించి వదిలేయడంతో కొనుగోళ్లు జరగడం లేదు. కుంటాల మండలంలోని ఆయా కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులకు ప్రతీ రోజు అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. దీంతో రైతులు అధికారుల వద్దకు వెళ్లగా తమకు ఉన్నతాధి కారుల నుంచి ఆదేశాల రాలేవని చేతులు దులుపుకుంటున్నారు. ధాన్యం పోసి కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసి 20 రోజులు గడిచినా కొనుగోళ్లు జరపక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీ రోజు అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేసి సేకరించిన ధాన్యాన్ని కల్లాల నుంచి తరలిస్తే బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు.


కుంటాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహారాష్ట్రకు తరలిపోతున్న పీడీఎస్ బియ్యం

బోథ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి రాత్రిపూట పొరుగున ఉన్న మహారాష్ట్రకు పీడీఎస్ రేషన్ బియ్యాన్ని తరలి స్తున్నారు. కిరాణా వ్యాపారం చేస్తున్న ఆ వ్యాపార రోజంతా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఏజెంట్ల ద్వారా బియ్యం కిలో రూ.15కు కొనుగోలు చేయించి రాత్రిపూట మహారాష్ట్రకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలో కిలో రూ.25 చొప్పున అమ్ముడు పోతుండటంతో దర్జాగా వ్యాపారాన్ని చేస్తున్నాడు.

● **మరలపల్లి మీదుగా..**

మండలంలోని మర్లపల్లి మీదుగా మహారాష్ట్రకు బియ్యం తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి పూట 45 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారని పక్కా సమాచారంతో రాజకీయ నాయకుడు పట్టుకు నేందుకు ప్రయత్నించగా లారీ పట్టుబడకుండా తప్పించుకున్నట్లు సమాచారం. అయితే అక్రమ బియ్యం వ్యాపారంపై అధికారులు దృష్టి సారించి నట్లయితే ఈ దందాకు బ్రేక్ పడే ఆస్కారం ఉంది.

● **చెక్‌పోస్టు అవసరం..**

అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేసేందుకు మరలపల్లి రూట్‌లో మార్కెట్ కమిటీ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై గతంలో మార్కెట్ కమిటీ దృష్టికి తీసుకువచ్చిన లాభం లేకుండా పోయిందని పలు గ్రామాల వారు అంటున్నారు. ఈ విషయంలో అధికారులు తగు నిర్ణయం తీసుకుని అక్రమంగా తర లిపోతున్న ధాన్యం బియ్యం రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 కనిష్ఠం 21.7
ఆంధ్రజ్యోతి
నిర్మల్ జిల్లా వార్తలు
8
ఆదివారం 3 నవంబరు 2024



రేపటి నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

భైంసా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతాంగానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర కల్పించేందుకు గాను సోమవారం నుంచి మార్కెట్ పరిధిలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పూర్య నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తేమ శాతం ఆధారంగా ధర కేటాయించడం జరుగుతుందన్నారు. పత్తి రైతుల సీసీఐ కొనుగోలు కేంద్రంలో తమ దిగుబడులను విక్రయించి కనీసమద్దతు ధర పొందాలని సూచించారు.

పకడ్బందీగా మత్తు కట్టడి



జాఫ్రాపూర్ పాఠశాలలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

- జిల్లాలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్రహరీ కమిటీ'ల ఏర్పాటు
- విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు
- విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్

నిర్మల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత కొంత కాలం నుంచి విద్యార్థులు, యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారిపోతున్న వ్యవహారాన్ని జిల్లా విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంటోంది. విద్యాసంస్థలు వాటి పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యార్థులు, పరిసర ప్రాంతాల్లో ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ టేలాల నుంచి ఈ మత్తు పదార్థాలను కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు, యువకులు గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వికృత చేష్టలు చేస్తున్నారు. సెలవు దినాలలో చాలా మంది విద్యార్థులు గంజాయి మత్తులోనే జోగుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. అయితే ఇప్పటికే పలుసార్లు పాఠశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన నష్టాలపై కౌన్సెలింగ్‌లు నిర్వహించినా ఫలితం కనిపించడం లేదు. దీంతో గత రెండు నెలల క్రితం విద్యాశాఖ మత్తు పదార్థాలకు బానిసలైన విద్యార్థులను విముక్తులను చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ప్రతీ పాఠశాలలో ప్రహరీ క్లబ్‌ల పేరిట ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను కూడా జిల్లా విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలలకు జారీ చేసింది. అయితే ఈ కమిటీల ఏర్పాటులో ఆలస్యం కావడంతో జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి వెంటనే కమిటీలను ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా కమిటీలను ఏర్పాటు చేసి దీనికి సంబంధించిన నివేదికలు తనకు అందజేయాలంటూ కలెక్టర్ సూచించారు. దీంతో అన్ని పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది.

కమిటీల పాత్ర కీలకం

ప్రహరీ క్లబ్‌ల పేరిట ఏర్పాటు చేస్తున్న కమిటీలకు విద్యాశాఖ కీలక బాధ్యతలు అప్పజెప్పింది. ప్రహరీ క్లబ్ కమిటీ సభ్యులు విద్యార్థులను, స్థానిక యువకులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే కాకుండా వారు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడడంతో పాటు గంజాయి ఇతర మత్తు పదార్థాలను నివారించాల్సి ఉంటుంది. పాఠశాల పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు విక్రయించే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించడం.. వాటిని అమ్ముతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మరోసారి అమ్మకుండా నివారించడం లాంటి బాధ్యతలను చేపట్టాల్సి ఉంటుంది. వారంలో ఒకటి రెండు రోజులు ప్రహరీ క్లబ్‌ల పేరిట విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని గైడ్‌లైన్స్‌లో పేర్కొన్నారు. ఈ కమిటీలో ఓ పోలీస్ కానిస్టేబుల్ కూడా సభ్యుడిగా ఉన్నందు వల్ల ఆయన ద్వారా ఎప్పటికప్పుడు పోలీసుశాఖ సహకారం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. స్థానికంగా అవగాహన ర్యాలీలు, సమావేశాలు జరిపి మత్తు పదార్థాలతో జరిగే నష్టాలను వివరించాల్సి ఉంటుంది.

ఇక విద్యార్థులకు కౌన్సెలింగ్‌లు

గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులను గుర్తించి టీచర్లు వారికి కౌన్సెలింగ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కనీసం 15 రోజులకోసారైనా స్థానికంగా ఉన్న సైకాలజిస్టుల చేత కౌన్సెలింగ్ లాంటి కార్యక్రమాలను కూడా చేపట్టనున్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి బహిరంగంగా కాకుండా ప్రత్యేకంగా కౌన్సెలింగ్‌లు నిర్వహించనున్నారు. ఇతర విద్యార్థులకు మత్తు పదార్థాలతో జరిగే దుష్పరిణామాలపై వివరించనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు తల్లిదండ్రుల సహకారం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలను కూడా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీల సందర్భంగా భాగస్వాములను చేయనున్నారు.

కమిటీల రూపకల్పన ఇలా..

అధికారులు ప్రహరీ క్లబ్ కమిటీల ఏర్పాటును పకడ్బందీగా చేపడుతున్నారు. ఈ క్లబ్‌ల ప్రెసిడెంట్‌గా స్థానిక పాఠశాల హెడ్‌మాస్టర్ లేదా ప్రిన్సిపాల్, వైస్ ప్రెసిడెంట్‌గా పాఠశాల సీనియర్ టీచర్ లేదా విద్యార్థులతో సన్నిహితంగా ఉండే టీచర్‌ను నియమించనున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను నియమిస్తారు. ప్రతీ తరగతి నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులకు కమిటీలో చోటు కల్పించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఒకరిని స్థానిక పోలీస్ కానిస్టేబుల్ నియమిస్తున్నారు.

జాఫ్రాపూర్ పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్ల విడుదల

సోన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సమాజంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరముందని, అందుకే ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసికట్టుగా పోరాడాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. 'తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమంలో భాగంగా జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలలో ఆయన మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలు, నష్టాలను వివరించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం పెరిగిపోతుందని దీంతో విద్యార్థులు, యువత తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని, గ్రామాల్లో వ్యవసాయదారులు కల్తీ కల్లు తీసుకోవడం ద్వారా యవ్వన దశలోనే వృద్ధాప్య లక్షణాలను పొందుతున్నారన్నారు. కల్లులో కలిపే ఆల్ఫ్రాజోలం, డైజోఫాం మనుషుల నాడీ వ్యవస్థపై పని చేసి కొంత కాలానికి కాళ్లు, చేతులు చచ్చుపడి పోతాయని, జ్ఞాపకశక్తి తగ్గిపోయి ఉన్మాదిగా తయారవుతారని అందువల్ల గంజాయి, హెరాయిన్, బ్రౌన్‌షుగర్, నల్ల మందు వంటి ప్రమాదకర మాదక ద్రవ్యాల వినియోగం నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగేష్ కుమార్, ముత్తన్న ఆసిఫ్ అలీ, అనితా, విజయమాల, అనుపమ, రవితేజ, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష

నిర్మల్ అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల ప్రత్యేక కార్యదర్శి దేవేందర్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ఆయన వరి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధాన్యం భద్రపరచు గోదాములు వేరువేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల ప్రత్యేక కార్యదర్శి దేవేందర్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సేకరించిన ధాన్యానికి సంబంధించిన వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు నేరుగా వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. కొనుగోలుకు సంబంధించిన వివరాల రిపోర్టులను ఎప్పటికప్పుడు తమకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 287 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 97 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తమ ధాన్యం తడవకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ధాన్యం బస్తాల కొరత ఏర్పడ కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంటింటి సమగ్ర సర్వేకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ సుల్తానియా హైదరాబాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని జిల్లాల్లో సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా ఇంటింటి సమగ్ర సర్వేకు సంబంధించి ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహణకు సరిపడినంత మంది ఎన్యూమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటికే ఇంటింటి సమగ్ర సర్వేకు సంబంధించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే వీరందరికీ శిక్షణను కల్పిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సీడీపీవో జీవరత్నం, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డీఆర్డీవో ఉన్నారు.

అన్ని కులాలకు న్యాయం చేసేందుకే కులగణన

- డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరి రావు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే కులగణన సర్వే అన్ని కులాలకు న్యాయం చేసేందుకేనని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.శ్రీహరి రావు అన్నారు. శనివారం మారుతి ఇన్ మంజులాపూర్‌లో డీసీసీ ఆధ్వర్యంలో మేధావులు, కులసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ... రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. అధ్యక్షత వహించిన భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ మాట్లాడుతూ... కులగణనను ప్రజలు విజయవంతం చేయాలన్నారు. సర్వేసమయంలో తమ కుటుంబ, కుల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలు సరైనవిగా ఉంటేనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 6 నుంచి మూడువారాల పాటు సర్వేకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మున్సిపల్‌చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనకు నిర్ణయం తీసుకుందన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందన్నారు. కుల సర్వే సక్రమంగా జరిగితే రాజకీయంగా, విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రయోజనం పొందవచ్చునని తెలిపారు. స్థానిక వైద్యుడు యూ.కృష్ణం రాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కుల గణన చేపట్టడం హర్షణీయమన్నారు. ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్ను, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మలారెడ్డి, మైనారిటీ నాయకులు అజహార్, చిలుక రమణ, వాజిద్ అహ్మద్, ఫారూఖ్ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

పార్టీ శ్రేణులకు నామినేటేడ్ పోస్టుల్లో ప్రాధాన్యత

- కాంగ్రెస్ ప్రతినిధి, కేంద్ర మాజీ మంత్రి డా.ఎస్.వేణుగోపాల చారి



మహాశెట్టివార్ దిగంబర్‌రావ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కేంద్రమాజీమంత్రి

భైంసా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో భర్తీ అయ్యే నామినేటేడ్ పోస్టుల్లో పార్టీ కోసం పాటుపడ్డ శ్రేణులకు ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రతినిధి, కేంద్ర మాజీ మంత్రి డా.ఎస్.వేణుగోపాల చారి వెల్లడించారు. శనివారం భైంసా పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మహాశెట్టివార్ దిగంబర్ రావ్ కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం మాజీఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ నివాస గృహంలో, స్థానిక విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, ప్రతినిధులు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ కమిటీ నియామకంలో పార్టీ కోసం పాటుపడ్డ వారిని కాకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి చోటు దక్కిందని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన కేంద్ర మాజీ మంత్రి డా.ఎస్.వేణుగోపాల చారి మాట్లాడుతూ ఇక నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటేడ్ పోస్టుల్లో అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత విషయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకవెళ్లి సమస్యలు పరిష్కారయ్యే దిశగా చర్యలు చేపడుతామన్నారు అంతకు ముందు కేంద్ర మాజీ మంత్రి చారి ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌ను ఆయన నివాస గృహంలో కలిసి అరగంటకు పైగా చర్చలు జరుపడం చర్చనీయాంశంగా మారింది,

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దస్తురాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని రేవోజిపేట్, బుట్టాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడం తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులు తాము పండించిన పంటలను బయటి దుకాణాల్లో కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మున్యాల్, గోండుగూడ గ్రామంలో దండారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. వారికి రూ. 15 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాముడుగు శైలజ రమేష్ రావు, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో కే. రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షుడు గుండా నరేష్, మాజీ ఎంపీపీ సింగరి కిషన్, నాయకులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ తరలించే వరకూ పోరాటం



రిలే నిరాహార దీక్షలో దిలావర్‌పూర్ గ్రామస్తులు

దిలావర్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుండంపల్లి - దిలావర్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను తరలించే వరకు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టనున్నట్లు ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి, గ్రామాభివృద్ధి కమిటీలు ప్రకటించాయి. శనివారం సమావేశమైన ఈ కమిటీలు భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించాయి. ప్రస్తుతం జరుగుతున్న సామాజిక, ఆర్థిక, కుల గణన ఇంటింటి సర్వేను, రాబోయే రోజుల్లో నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. కులాల వారీగా రోజు రిలే నిరాహార దీక్షలు చేస్తామని, అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసు చట్టం అమలు : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో పోలీసు చట్టం అమలు చేస్తున్నట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ నెల 30 వరకు పోలీసు చట్టం అమలులో ఉంటుందన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదని తెలిపారు. బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిషేధమన్నారు. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు ఉపయోగించరాదన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుచట్టం అమలులో ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలుంటాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మునిపెల్లి బాలిక ఎంపిక

లక్ష్మణచాంద, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సంగెం నవీన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్మల్ సెక్రటరీ రవీందర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్- 14 ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నవీన్ రాష్ట్ర స్థాయికి ఎంపికవగా పలువురు అభినందించారు. కాగా నవీన ప్రభుత్వం ద్వారా అమలు చేయబడుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా ఎంపికై ప్రస్తుతం రవి హైస్కూల్ నిర్మల్‌లో 7వ తరగతి చదువుతోంది. పాఠశాల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు అభినందించారు.

వీసీలకు సీఎం దిశానిర్దేశం



వీసీలతో సీఎం రేవంత్ రెడ్డి

బాసర, నవంబర్, 2 : (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లతో సమావేశం నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో పాటు యూనివర్సిటీల వీసీలు ముఖ్య మంత్రి జుబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. యూనివర్సిటీల్లో ప్రస్తుత పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఆశ్చర్యకర నిర్ణయాలు ఉంటా యంటూ హెచ్చరించినట్లు తెలిసింది. సమావేశంలో బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ పాల్గొన్నారు. ట్రిపుల్ ఐటీ పరిస్థితులపై సమగ్ర అధ్యాయనం చేసి ప్రమణాలను పెంచే చర్యలు తీసుకుంటామని వైస్ చాన్సలర్ శనివారం సమావేశం అనంతరం వెల్లడించారు.

జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన కేజీబీవీ విద్యార్థులు

దిలావర్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్- 17 జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థులు బి.ప్రియాంక, జే. శృతిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండల, జిల్లా, జోనల్ స్థాయిల్లో జరిగిన పోటీల్లో రాణించిన వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నిర్వాహకులు ధ్రువపత్రాలు అందజేశారు. కేజీబీవీ ఎస్‌వో అపర్ణ, పీఈటీ ఏ. జయ, జూడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్ అభినందించారు.

డైట్, కాస్మోటిక్ ఛార్జీల పెంపుపై హర్షం

ముథోల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దీపావళి కానుకలో భాగంగా డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు చేయడంతో ముథోల్ తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌సీవో అగస్టీన్ సూచన మేరకు ప్రిన్సిపాల్ శిరీష ఆధ్వర్యంలో చార్జీల పెంపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంలకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.